# అమెరికా కొడుకు

— స్వామి చిత్రానంద

మిమ్మల్నే!

"......."

"అప్పుడే నిద్రా? అంటూ తన పడకగదిలోకి వచ్చింది సీతాయమ్మగారు. ఆమె చేతిలో తమలపాకుల పళ్ళెం వుంది. మెల్లగా ఆ పళ్లెం భర్త తల దగ్గర వుంచి, తాను భర్త పాదాల దగ్గర చేరింది. మెల్లగా పాదాలు ఒత్తటం ప్రారంభించింది.

ఆమె పాదాలు ఒత్తుతుంటే, ఆయన కొంచెం అటూయిటూ ఒత్తిగిలి—

"ఊ" అన్నారు విసుగ్గా.

"కోపమా?" అంది నవ్వుతూ.

"......"

"తాంబూలం వేసుకోండి" అని పళ్లెం ఆయనకు అందించింది.

"ఊహు...చిలకలు కావాలి" అన్నారు పళ్లెం తోసేస్తూ.

"చిలకలు లేవు పిచికలూ లేవు. తమలపాకులకి సున్నం రాసి, ఈనెలు తీసి శుభ్రంగా చీల్చి వుంచాను. వక్కపొడి డబ్బా అక్కడేవుంది." అని లేచి వెళ్లబోయింది ఆమె పమిటను పట్టుకుని ఆపాడు.

"ఒద్దండి, ప..దువాలో పిల్లలు ఇంకా నిద్దరో లేదు."

"వాళ్లకి మా అమ్మ వుంది. జో గొడుతుంది. నాకే ఎవ్వరూ లేరు."

"పాపం!...అశ!..రాను రాను మీరు మరీ పసిపిల్లాడయి పోతున్నారు."

"....."

"ముగ్గురు పిల్లలకి తండ్రి. మరో నాలుగేళ్లు పోతే, మామగారవుతారు కూడా. వన్నొదలండి" అంది.

"....."

తప్పనిసరై మంచం మీద కూచుని చిలకలు చుట్టడం మొదలెట్టింది.

"ఏమండీ! మిమ్మల్ని ఓ మాట అడుగుతాను కాదనకూడదు."

"అలాగే" అన్నారు.

ఆమె చిలుకలు వున్న పళ్లెం అందించింది.

అందులోంచి ఆయన ఆ చిలకల్ని తీసుకుని, ఆమె కుడిచేతి అయిదువేళ్లకూ తొడిగి, ఆ చేతి వేళ్లని తన కుడిచేతితో నొక్కి పట్టుకుని, తన నోటిలో పెట్టుకుని, సగం కొరికి, మిగతా సగం ఆమె నోటికి అందించాడు.

"అడుగు" అన్నారు ఆమె కళ్లల్లోకి చూస్తూ.

"ఈ కానుపు అయింతర్వాత, ఆపరేషన్ చేయించుకుంటానండీ. నలుగురు పిల్లలు చాలదూ? వాళ్లని పెంచి పెద్దచేసేసరికి, అవుతుంది మనపని."

"సరే! మరి, మగపిల్లాడు కావాలనుకున్నాం కదా?"

"నేనేం అనుకోలేదు. మీరూ మీ అమ్మగారూ అనుకున్నారు!"

"మగ పిల్లాడు ఇలా పుట్టనీ— అలా ఫుల్‌స్టాప్!" అన్నాడు.

అలా అంటూనే మగపిల్లాడి కోసం మరోముగ్గురు— మొత్తం ఆరుగురు ఆడపిల్లల్ని కన్నారు. ఏడో సంతానం పుత్రరత్నం కలిగాడు. 'వంశోద్ధారకుడు పుట్టాడు' అన్నారు పెద్దలు. జాతకాలు వేశారు పండితులు. 'భరణీ నక్షత్రం' అన్నారు. ధరణి ఏలతాడు అన్నారు జ్యోతిష్కులు.

ఆ సంతోషంతో ఆ మండువాలో డాలి మారు మోగింది. ఆ సంతోషం వూరు వూరంతా పంచుకున్నారు. లేకలేక పంతుల్లుగారికి ఓ చిన్న పంతులుగారు పుట్టాడు. ఊరూ వాడా ఇవే కబుర్లు!

* * * * * *

చిన్నపంతులుగారికి నామకరణ మహోత్సవం అన్నారు. శ్రీ వీరవెంకట సత్యనారాయణ మూర్తి అని పేరు పెట్టారు. తమ తాతగారి పేరూ—ఇష్ట దైవం పేరూ రెండూ కలిసి వచ్చాయి. అయిదోఏట అక్షరాభ్యాసం చేశారు. అన్నీ యథావిధిగా జరిపించారు. ఆవూరి బడిలో వున్న పిల్లలందర్నీ పిలిచారు. పలకలూ బలపాలూ ఇచ్చారు. అందరికీ మిఠాయిలూ పెట్టారు. ఉపాధ్యాయులకీ, పురోహితులకీ కొత్తబట్టలు పెట్టారు. ఆ అక్షరాభ్యాసానికి వచ్చిన కుర్రాడి మేనమామ— "బావా! వాడికి ఈ వూళ్లో చదువు ఏవిటయ్యా! ఏదో లక్షణంగా మాంచి బోర్డింగు స్కూళ్లో పెట్టి చదివించక! లేదా పోదా? ఒక్కగా నొక్క కొడుకు" అని సలహా ఇచ్చాడు.

"పంతులుగారికి ఈ ఆలోచన బాగానే వున్నట్టు తోచింది. కాని, తల్లి మాత్రం వద్దంది. ఉన్న ఒక్కగానొక్క కొడుకూ—అనాథలాగ అలా వుంచడం ఏమిటండీ?" అంది.

"ఏమంత ఊరుగాని వూరు పోతున్నాడే! పిలిస్తే పలుకుతాడు. ఇలా కాకి చేత కబురంపితే, అలా రెక్కలు కట్టుకువచ్చి వాలతాడు" అని ఆమె మాట కొట్టిపడేశాడు బోర్డింగ్ స్కూళ్లో చేర్పించారు.

శని ఆదివారాల్లో కూడా వచ్చేవాడు కాదు. ఎప్పుడైనా వస్తే వేసవి శలవులకీ, దసరా సెలవులకీ, సంక్రాంతి సెలవులకీ వచ్చేవాడు. అది కూడా చాలా తక్కువే. ఎప్పుడూ స్నేహితులూ, టూర్లూ, ఎక్స్‌కర్షన్లూ అంటూ దేశం తిరుగుతూనే వుండేవాడు.

అంచేత అతను ఇంటికి వచ్చినా, ఏదో చుట్టపు చూపుగా వచ్చినట్టు తప్పితే, తల్లిదండ్రుల దగ్గరకు వచ్చినట్టు వుండేది కాదు. అంచేత, తల్లిదండ్రులప్రేమ, మమకారం ఏమీ తెలియదు. ఏదో రావడం, పోవడం అంతే.

డిగ్రీ పూర్తి చేశాడు.

అతని తెలివి తేటలు చూసిన లెక్చరర్లు అతన్ని అమెరికా పంపాలన్నారు. అతని తెలివికి మనదేశంలో మార్కెట్ లేదన్నారు. ఆ తెలివికి అమెరికాయే తగినదేశం అన్నారు. అమెరికా వెళ్తున్నాడని తెలియగానే తల్లి భోరున ఏడ్చింది.

"అక్కడ ఏమీ మన పద్ధతులు కావటగా? మనకు రాత్రయితే వాళ్లకి పగలటగా! ఏవిటో వాళ్లంతా భూమికి అవతల పక్కన వుంటారటగా!" అంది.

"అవన్నీ నిజమేనే అమ్మ. పెద్దక్క ఢిల్లీ నుంచి ఇక్కడికి రావడానికి వచ్చినంతసేపు నేనక్కడ విమానం ఎక్కితే, ఇక్కడ దిగుతా. వారం వారం నీతో ఫోన్లో మాట్లాడుతాను. సరేనా?"

"అది నిజమేరా— కానీ—"

"కానీ, ఏముందమ్మా! నేను కూడా ఆడపిల్లనే అనుకో. నాక్కూడా పెళ్లి చేసి, అత్తారింటికి పంపావనుకో" అన్నాడు.

"మా బాగా చెప్పావురా" అన్నాడు మేనమామ.



"ఏవిటో–మీకెంత తోస్తే అంత! నా మాట ఎవరూ వినరు. మీ ఇష్టం" అంది తల్లి.

అయిష్టంగానే సాగనంపారు. ఆరుగురూ అక్కలూ, బావలూ వాళ్ల పిల్లలూ వచ్చారు. వీడ్కోలు ఇచ్చారు. అమెరికా చేరింతర్వాత ఓనాటి రాత్రి –పేరు పేరునా ఒకరి తర్వాత ఒకరితో ఓ గంటసేపు ఫోన్లో మాట్లాడాడు.

"ఇవుడు వాడికి మధ్యాహ్నమటగా! వెర్రి నాగమ్మ! నిద్దరుండదు పాపం!" అనుకుంది తల్లి.

వచ్చిన బంధువులంతా ఎవరి గూటికి వారు వెళ్లి పోయారు. ఎవరుమాత్రం ఎంతకాలం వుంటారు? ఎవరి కాపరాలు వారివి. ఎవరి బాధలు వారివి. ఎవరి బాధ్యతలు వారివి.

కాలచక్రం దొర్లుతోంది.

ఉన్నట్టుండి అమెరికా నుంచి ఓ వుత్తరం వచ్చింది. అందులో ఓ ఫోటో కూడా వుంది. అదతను భార్యతో తీయించుకున్న ఫోటో.

పంతులుగారికి చెప్పరాని షాక్! చదివిన వుత్తరమే మళ్లీ మళ్లీ చదివాడు. ఎంత చదువుకున్నా సంగతి మారలేదు. అదే సంగతి. 'నేనూ ఈ అమ్మాయి పెళ్లి చేసుకున్నాం' అని.

ఆ సంగతి తెల్సిన సీతాయమ్మగారు భోరు భోరున ఏడ్చారు. అన్నం ముట్టలేదు. పంతులు గారు కూడా ఏమీ తినడం లేదు.

"అమెరికానుంచి వుత్తరం వచ్చిందటగా?" అంటూ కరణంగారు వచ్చారు.

పంతులు గారు మెల్లగా ఈ లోకంలోకి వచ్చి– కొడుకు రాసిన వుత్తరం, ఫోటో కరణం గారికి ఇచ్చారు. కరణంగారు చదివారు. నిశ్చేష్టులైపోయారు. పంతులుగారు–

"నేను చచ్చింతర్వాత తలకొరివి పెట్టడానికి ఓ కొడుకు కావాలనుకున్నాను. కాని వాడు నేను బతికుండగానే నాకు కొరివి పెట్టాడయ్యా ఈ శరీరం కాలిపోతుంది. ఇక అట్టే కాలం వుండదు" అన్నారు చాలా బాధగా, కరణంగారు మాత్రం–

"ఊరుకోవయ్యా ఊరుకో. అన్నీ కాలక్రమేణా అవే సర్దుకుంటాయి" అని ఓదార్చారు.

కాని, పంతులుగారు ఆ బాధనీ అవమానాన్నీ నిగ్రహించుకోలేకపోయారు.

అలాగే మంచంపట్టారు. ఈడ్చుకుని ఈడ్చుకుని ప్రాణం వదిలారు.

అప్పుడు కూడా కొడుకు రాలేదు. పెద్ద అల్లుడే కర్మ అంతా చేశాడు.

ఆరుగురు కూతుళ్లూ, అల్లుళ్లు, మనవలు, మనవారాళ్లు అంతా వచ్చారు. తల్లిని ఓదార్చారు.

కాని, ఏం లాభం? పోయిన భర్తను ఎలాగూ తీసుకురాలేరు. ఉన్న ఆ కొడుకునీ తీసుకురాలేక పోయారు. కూతుళ్లు అంతా–ఒకరి తర్వాత ఒకరు వచ్చి, తల్లికి తోడుగా వుంటూ వచ్చారు.

ఆ తర్వాత పంతులుగారి తల్లి కూడా పోయింది. సీతాయమ్మగారు ఇప్పుడు ఒంటరిదై పోయింది. అంచేత, ఆమె పెద్దకూతురు తల్లితో–

'అమ్మా! నేను కొడుకునైతే నా దగ్గరే వుండేదానివి కదా! నువ్వు రామ్మా– మా దగ్గర వుండు మీ అల్లుడుగారు కూడా నీతో చెప్పమన్నారు" అంది.

"రా– అమ్మమ్మా! మా ఇంటికి వెళ్లిపోదాం" అన్నారు మనవలు మనవరాళ్లు.

ఆ మనవల్లో ఒకడిది ఆమె భర్తగారి పేరు– అతగాడిని అంతా 'చిన్న పంతులుగారు' అనేవారు.

"రా–అమ్మమ్మ!" అని అడిగాడు.

"వస్తానయ్యా" అని పెద్ద కూతురు దగ్గరకు వెళ్లడానికి నిశ్చయించుకుంది.

* * * * * *

పెద్దకూతురు ఇంట్లో సీతాయమ్మగారికి ఓ గది ప్రత్యేకంగా ఇచ్చారు. అందులోనే ఆమె పడక– ఓ మూలగా చిన్న పూజామందిరం. అందులో ఆమె భర్త ఫోటో కూడా పెట్టుకుంది. ఆమె ఎప్పుడూ ఆ భర్తఫోటో వైపు చూస్తూ వుండేది. అప్పుడప్పుడు వచన రామాయణం, భారతం చదువుకునేది.

మనవడు ఆమెకు చాలా మచ్చిక అయ్యాడు. ఎప్పుడూ ఆమె దగ్గరే వుండేవాడు. వాడిని చూసి నప్పుడల్లా ఆమెకు తన భర్త గుర్తు వచ్చేవారు.

"నువ్వు నా దగ్గరే పడుకోవాలి" అనేవాడు.

వాడు ఎప్పుడూ అమ్మమ్మ పక్కలోనే పడుకునే వాడు. వాడిని ఉదయాన్నే లేపి, స్కూలుకి సిద్ధం చేయడం– అన్నీ ఆవిడే చూసేది. ఒకవిధంగా చెప్పాలంటే మనవడిని విడిచి వుండేదికాదు. మిగతా కూతుళ్లు తమ దగ్గరకు రమ్మన్నా "వాడికి సెలవులు ఇవ్వనీ" అని దాటవేసేది.

ప్రతిరోజూ ఆమె ముందు లేచి, తరువాత మనవడిని లేపేది. కాని ఓ రోజుమాత్రం మనవడు ముందులేచి, అమ్మమ్మను లేపాడు. ఆమె లేవలేదు. తల్లి దగ్గరకు వెళ్లి–

"అమ్మా! అమ్మమ్మ లేవలేదు. నాకు నీళ్లు ఎవరు పోస్తారు?" అన్నాడు. కూతురు తల్లిదగ్గరకు వచ్చి పిలిచింది. ఆమె లేవలేదు. "అమ్మా! అమ్మా!" అని కదిపింది. అయినా లేవలేదు. ఖంగారుగా భర్తను పిలిచింది. భర్త వచ్చాడు. ఆమె పరిస్థితి చూసి–

"మీ అమ్మగారు లేవరు" అన్నాడు. ఇద్దరూ కలిసి ఆమెను కిందపడుకోబెట్టారు.

అప్పుడే ఆమె తలకింద వున్న చేతిలోని వుత్తరం చూశారు.

"లక్ష్మి!

రేపు ఉదయం నేను లేవననుకుంటాను. మీ నాన్నగారు రమ్మంటున్నారు. నాకు తలకొరివి నువ్వే పెట్టాలి. 'అమ్మా! నేను మొగాడినైతే నీకు పెద్ద కొడుకునేగా' అన్నావు గుర్తుందా?" అని రాసివుంది.

అంతా గొల్లుమన్నారు.

మిగతా చెల్లెళ్లకూ, తమ్ముడికీ కబుర్లు పంపారు. ఆడపిల్లలు వచ్చారు.

కొడుకుమాత్రం ఏడో రోజున వచ్చాడు. భార్యతోను కూతురుతోను.

అప్పటికే అన్నీ పూర్తయిపోయాయి.

"ఇంత ఖర్చుపెట్టుకు వచ్చాం అంతా వేస్ట్" అందా భార్య.

ఆ పదిరోజుల్లోనూ ఆమె రాసిన వుత్తరం సంగతే చెప్పుకున్నారంతా.

"తలకొరివి పెట్టడానికి మగాడు కావాలనుకోవడం మూర్ఖత్వం అండి, అసలు ఆడ ఏమిటి? మగ ఏమిటి? సంతానం అన్న తర్వాత అంతా ఒక్కటే" అన్నారు ఒకానొక వృద్ధ స్వాతంత్ర్య సమరయోధుడు.

"నిజమే అనిపిస్తోంది. ఆ మహాతల్లి సీతాయమ్మ గారి కథ వింటుంటే"

అన్నారు మరో పెద్దమనిషి.